# 8

# దావీదు కుమారుడు/అబ్రాహాము కుమారుడు

## (మత్తయి 1)

యేసు క్రీస్తుని గాధను వ్రాయుమని క్రొత్త నిబంధనను వ్రాసే పనిని దేవుడు మీకు అప్పగించినట్లయితే, మీరు ఎలా ప్రారంభించేవారు? బహుశ, మత్తయి వ్రాసినట్లుగా మీరు పదిహేడు వచనాల వంశావళిలో, నలభై రెండు తరాల వివరాలతో మీరు ప్రారంభించేవారు కారు. వాక్యంలో ఎక్కువమంది చదువని వాక్యభాగములలో మత్తయి 1:1–17 కూడా ఒకటి. ఎక్కువమంది ఒకేసారి 18వ వచనమునకు వెళ్ళిపోతారు. అంతకుముందు 17 వచనాలు అసలు ఉన్నాయన్న విషయాన్ని పట్టించుకోరు.

వాక్య బయల్పాటు నేపథ్యమును గమనిస్తే, క్రొత్త నిబంధనను ఆరంభించుటకు మత్తయి 1 పరిపూర్ణ విధానముగా తోస్తుంది. క్రొత్త నిబంధనలో మత్తయి సువార్తే మొదటిగా వ్రాయబడింది గనుక అది క్రొత్త నిబంధనలో తొలి పుస్తకంగా ఉంచబడలేదు. పౌలు పత్రికలు మత్తయి సువార్త కంటే ముందే వ్రాయబడ్డాయి. క్రొత్త నిబంధన *కాలమాన ప్రకారముగా* ఏర్పాటు చేయబడలేదు; గాని *విషయానుసారముగా* ఏర్పాటుచేయబడింది. యేసు కథను తెలియజేయడానికి మొదట నాలుగు సువార్తలు ఇయ్యబడ్డాయి. తరువాతదిగా యేసు ప్రభువు ఆరంభించిన ఉద్యమం గురించిన అపొస్తలుల కార్యముల గ్రంథము. తరువాత, వేర్వేరు సంఘములకు, వ్యక్తులకు వ్రాయబడిన పత్రికలు. ఇందులో సంఘం అంటే ఏమిటో వివరించబడింది. చివరిగా, ఈ లోకమునకు మరలా వచ్చి, తన ప్రజలను పరలోకమునకు తీసుకువెళ్ళు యేసుక్రీస్తును మహిమపరచబడిన దేవుని గొఱ్ఱెపిల్లగా చూపిస్తూ, అన్నిటి అంతము సమీపించినదని తెలియజేస్తున్న ప్రకటన గ్రంథం పొందుపరచబడింది.

ఈ వంశావళితోనే క్రొత్త నిబంధన ఎందుకు ఆరంభించబడింది? ఎందుకంటే, ఇది పాత మరియు క్రొత్త నిబంధన మధ్య చక్కని సంబంధమును ఏర్పరిచేదిగా యుంది. మత్తయి సువార్తను మొదటి సారిగా చదివిన చదువరులకు (ఖచ్చితంగా యూదులే), ఈ వంశావళి కేవలం పేర్లు కాదు. Thomas G. Long వివరిస్తున్న ప్రకారం "ఇది విభిన్న గాధల సంకలనం, ప్రతి పేరు మంచి జ్ఞాపకాన్ని అందిస్తుంది."[1] హెబ్రీ లేఖనాలలో నిష్ణాతులైన వారికి మాత్రం, "అబ్రాహాము," "బోయజు," "ఉజ్జియా," "జెరుబ్బాబెలు" వంటి పేర్లు పాత నిబంధనలో వారి పేరున్న కథలను వారికి గుర్తు చేస్తాయి. ఈ "వంశవృక్షం" అనేది ఆ కుటుంబ కథలకు సంక్షిప్త రూపం వంటిది. ఈ కుటుంబ నేపథ్య గాధ అంతా ఆఖరకు క్రీస్తు యేసునొద్దకు నడిపించబడింది. దీని నిమిత్తమై, ఇవన్నీ కూడా ఉన్నాయి.

మత్తయి 1వ అధ్యాయంలో కేవలం వంశావళి మాత్రమే లేదు. వంశావళి తరువాత, 18 నుండి 25 వచనాలు యేసుని జననమును గురించి తెలియజేస్తున్నాయి (క్రొత్త నిబంధనలో ఈ అద్భుత ఘట్టాన్ని వివరిస్తున్న రెండు కథనాలలో ఒకటి లూకా 2వ అధ్యాయం కాగా మొదటిది ఇది). వంశావళి మరియు క్రీస్తు జననం రెండూ కలిపి ఇవ్వడం ద్వారా మత్తయి మరియు ఇతర క్రొత్త నిబంధన గ్రంథకర్తలు యేసును గురించి ఏం చెప్పదలిచారో దాని

సందేశం ఇక్కడ కనబడుతుంది.

వివరంగా చెప్పాలంటే, క్రీస్తును గురించి, ఆయన ఎవరన్న విషయం గురించి ప్రాముఖ్య సత్యములను మత్తయి 1 తెలియజేస్తుంది.

## ఇశ్రాయేలీయుల, మెస్సీయాయైన యేసు

“అబ్రాహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసు క్రీస్తు (మెస్సీయ) వంశావళి” అన్న మాటలతో మత్తయి 1:1 ప్రారంభమవుతుంది. మనకు యేసు క్రీస్తు అన్న పేరు పరిచితమే. “క్రీస్తు” అనేది “యేసు” యొక్క ఆఖరి పేరు అనుకుంటాము. దీనిని ఇలాగే మనం వాడుతున్నాగాని, ఇందులోని ఉద్దేశం మాత్రం విభిన్నమైనది.

క్రీస్తు అనే పదం *క్రిస్టోస్* అనే గ్రీకు పదంనుండి వచ్చింది. ఇది హెబ్రీ పదమైన “మెస్సీయాకు” సమాంతర పదము. కాబట్టి “యేసు క్రీస్తు” అనేది కేవలం పేరు మాత్రమే కాదు; ఇది విశ్వాస ఒప్పుకోలు. ఇంగ్లీష్‌లోని కొన్ని తర్జుమాలలో (KJV; ASV; NIV; ESV) మత్తయి 1:1లో “యేసుక్రీస్తు” అని మాత్రం వ్రాయబడింది; కానీ కొన్ని తర్జుమాలలో (NASB; NRSV; NLT ) *క్రిస్టోస్‌ను* “మెస్సీయగా” అనువదించారు. “యేసు క్రీస్తు” అంటే “యేసే మెస్సీయ” అని గుర్తు చేయడానికి వారు యిలా చేశారు. (16 నుండి 18 వచనాలను పెద్దగా రెండు సార్లు చదవండి. మొదటిసారి “మెస్సీయ” అని, రెండవసారి “క్రీస్తు” అని చదివి, తేడాను గమనించండి.)

“మెస్సీయ” అంటే ఏమిటి? అక్షరార్థముగా, దీనికి “అభిషిక్తుడు” అని అర్థము. పాత నిబంధనలో రాజులు మరియు ప్రవక్తలు దేవుని నామమున పలుకుటకు, ఆయన తరపున ప్రతినిధిగా ఉండుటకు వారు దేవుని చేత అభిషేకించబడేవారు. 2 సమూయేలు 7లో దావీదుతో దేవుడు వాగ్దానం చేస్తూ, తన సింహాసనం మీద కూర్చుండి నిత్యము పరిపాలించు రాజుగా, ఎంతో కాలంనుండి నిరీక్షింపబడుతున్న “మెస్సీయగా” దేవుడు సెలవిచ్చాడు. విమోచకుని గురించిన నిరీక్షణ యెషయా వంటి ప్రవక్తల చేతను చెప్పబడింది. అందులో భాగంగానే ఒక రోజున దేవుడు “రాజ్యమును పునరుద్ధరిస్తాడని” వాగ్దానం చేశాడు. దీనికి ఇశ్రాయేలీయులు తమ శత్రువుల అణచివేతకు సంబంధించిన వాగ్దానముగా దీనిని భావించారు.

వాగ్దానం చేయబడిన మెస్సీయగా యేసును చూపించుటకు మత్తయి తన వంశావళిలో యేసును అబ్రాహాము మరియు దావీదుల వంశ క్రమమునకు చెందినవాడుగా చూపించాడు. కొలమాన ప్రకారం అబ్రాహాము దావీదు కంటే ముందరవాడైనను 1:1లో అబ్రాహాము కంటే దావీదు పేరు ముందు వస్తుంది (ఇంగ్లీషు బైబిలులో). ఇక్కడ చెప్పదల్చిన విషయం ఒక్కటే, మెస్సీయ నిత్యము పరిపాలన చేస్తాడని ఎవరితోనయితే దేవుడు వాగ్దానం చేశాడో ఆ దావీదు సంతతివాడైన యేసు “దావీదు సంబంధిత మెస్సీయ”యైయున్నాడు.

దావీదునకు మరియు ఇశ్రాయేలీయులందరికి దేవుడు చేసిన వాగ్దానం యేసు ద్వారా నెరవేరిందన్నది మత్తయి యొక్క సందేశం. అందుకనే మత్తయి, మార్కు, లూకా సువార్తలు (“Synoptic” సువార్తలు) “దేవుని రాజ్యమును” గురించిన యేసు ప్రబోధనలను నొక్కి చెప్పారు (మత్తయిలో ఇది “పరలోక రాజ్యముగా” పిలువబడింది): యేసే సార్వత్రిక రాజు, ఆయన రాకతో ఈ భూమిమీద దేవుని పరిపాలన ఆరంభమయింది. “అప్పటినుండి యేసు పరలోకరాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడని చెప్పుచు ప్రకటింప

మొదలు పెట్టెను" (మత్తయి 4:17). నిరీక్షణా కాలం అయిపోయింది. మెస్సీయ/రాజు వచ్చియున్నాడు. అందుకనే ఆయనను గురించిన రాకను వారు "సువార్త" అని పిలిచారు. ఇది దేవుని వాగ్దానములు నెరవేరిన కాలమును గురించిన శుభవార్త.

## యేసు, ఈ లోక రక్షకుడు

యేసు కేవలం ఇశ్రాయేలీయుల మెస్సీయా అయితే, యూదేతరులకు ఇది శుభవార్త కానే కాదు. ఆయన కేవలం ఒక గుంపువారికి విమోచకుడే గాక అంతకంటే ఎక్కువ అని మత్తయి తెలియజేస్తున్నాడు. ఆయన ఈ లోకమంతటిలోనీ "రక్షకుడు."

దేవదూత యోసేపునకు కనబడి, మరియ తనయునికి "యేసు" అను పేరు పెట్టాలని సూచించాడు. ఎందుకంటే, అతడు "తన ప్రజలను *వారి పాపములనుండి రక్షించును*" అని 1:21లో చూస్తున్నాము (నొక్కి చెప్పింది నాది). "యేసు" అను పదం హెబ్రీ పదమైన "యెహోషువా" నుండి వచ్చింది. దీనికి "యెహోవా రక్షించును," లేదా "యెహోవాయే రక్షణ" అని అర్థం. మెస్సీయాకు ఎందుకు ఈ పేరు పెట్టబడింది? ఎందుకంటే, "తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును" అంటే ఆయన రోమా బానిసత్వమునుండి విమోచించే జాతీయ ఉద్యమ విమోచకుడు కాదు. గాని రోమీయుల కంటే అతి ప్రమాదకరమైన శత్రువు నుండి ప్రజలందరిని విమోచించు రక్షకుడు ఆయన.

రక్షణ యొక్క సార్వత్రికతను వంశావళి నొక్కి చెప్తుంది (అంటే, ఇది కేవలం యూదులకే గాక, పాపులందరి నిమిత్తం) నలభై రెండు తరముల జాబితాను పరిశీలిస్తే, పాపమును గురించిన భయంకర కథలు మనకు బయల్పడతాయి. స్వయానా దావీదు వ్యభిచారం, హత్య, అబద్ధం వంటి పాపములు చేశాడు (2 సమూయేలు 11; 12). ఇశ్రాయేలు పన్నెండు గోత్రకర్తల తండ్రియైన యాకోబు జ్యేష్ఠత్వపు హక్కును కోరుకోవడంలో మోసగించాడని కొందరి భావన. అదే నిజమైతే – యిలాంటి వానితో మనం వ్యవహరించుటకు యిష్టపడం (ఆదికాండము 27–31)! జ్ఞానవంతుడైన సొలొమోను తన చివరి కాలంలో అన్య స్త్రీలను వివాహమాడి ఇశ్రాయేలుతో అన్య దేవతలను ప్రతిష్టించాడు (1 రాజులు 11:1–8). ఇశ్రాయేలు దుష్ట రాజులలో ఒకడైన మనష్షే ఆలయములోనే అన్య దేవతా బలిపీఠాలను ప్రతిష్టించాడు (2 రాజులు 21:1, 4–6). అయినను, వీరందరు యేసుని వంశ వృక్షంలో ఉండుటనుబట్టి, ఆయన "నిజమైన పాపులను" రక్షించుటకు వచ్చాడని అర్థమవుతుంది. (యేసు యొక్క వంశ క్రమము మెరుగుదల్చబడిన "పవిత్రమైనది" అని చెప్పకుండా, మత్తయి దీనిని యథార్థముగా పేర్కొన్నాడని దీన్ని బట్టి అర్థమవుతుంది.)

ఈ వంశ క్రమము లింగ భేదము లేనిది కూడాను. ఈ జాబితాలలో ఐదుగురు స్త్రీలు మనకు కనబడతారు – తామారు, రాహాబు, రూతు, బత్షెబ, మరియు కన్యయైన మరియ. యూదుల వంశావళిలో స్త్రీలను చేర్చడం క్రొత్తేమీ కాదు గాని ఇది సంప్రదాయం కాదు. (ఉదాహరణకు, పోల్చి చూడు, ఆదికాండము 4:17–22 నుండి ఆదికాండము 10:1–20.) వంశ క్రమములో ఐదురుగు స్త్రీలను చేర్చడం ద్వారా మత్తయి ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాడు – యేసు పురుషులు మరియు స్త్రీలు ఇద్దరికీ రక్షకుడు. అంతేగాకుండా దేవుని ప్రణాళికను నెరవేర్చడంలో స్త్రీలు కూడా ప్రధాన పాత్ర పోషించారని ఇతడు తెలియజేస్తున్నాడు.

ఇంతేగాకుండా, వంశావళిలో విభిన్న జాతీయత కనబడుతుంది. ఐదుగురిలో నలుగురు

స్త్రీలు యూదేతరులు. తన కుమారుడికిచ్చి పెళ్ళి చేయడానికి యూదా ఎన్నుకొనిన స్త్రీ కనానీయురాలైన తామారు. రాహబు కనానీయురాలైన వేశ్య. ఇశ్రాయేలీయుడిని వివాహమాడిన రూతు మోయాబీయురాలు. దావీదు వ్యభిచరించి పెండ్లి చేసుకున్న బత్షెబ హిత్తీయురాలు. హిత్తీయుడైన ఊరియా యొక్క భార్య ఈమె. మత్తయి తన సువార్త ముగింపులో ఇచ్చిన మహా ఆజ్ఞ ఈ వంశావళిలోనూ కనబడుతుంది. "కాబట్టి మీరు వెళ్ళి, *సమస్త జనులను శిష్యులనుగా చేయుడి;* తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు ..." (28:19, 20ఎ; నొక్కి చెప్పింది నాది).

మత్తయి చెప్పదల్చుకున్న విషయం స్పష్టమవుతుంది: స్త్రీయైనా పురుషుడైనా – యూదుడైనా అన్యుడైనా – పాపులందరికి యేసే రక్షకుడు.

## యేసు, దేవుడు మరియు మానవుడు కూడాను

మరియ గర్భం దాల్చడం మరియు యేసు జన్మించడం గురించి తెలియజేస్తూ, యేసు, యోసేపు యొక్క శారీరక బిడ్డ కాదని మత్తయి నిర్ధారిస్తున్నాడు. యోసేపు మరియలు ఇంతకు ముందే ప్రధానం చేయబడినను "వారేకము కాకముందే," అంటే వారి మధ్య శారీరక కలయిక లేకముందే మరియ గర్భవతి అయింది (1:18). "ఆమె కుమారుని కను వరకు ఆమెను యోసేపు ఎరుగకుండెను" అని 25వ వచనం చెప్తుంది (ESV). పరిశుద్ధాత్ముని కార్యం వలన మరియ గర్భం దాల్చెనని మత్తయి రెండుసార్లు చెప్తున్నాడు (18, 20 వచనాలు). ఆమె కన్య అని 23వ వచనం ప్రత్యేకంగా చెప్తుంది. (యేసు యోసేపు యొక్క శరీరక సంతతి కాదన్న విషయం వంశావళిని త్రోసిపుచ్చడం కాదు. ఒక బిడ్డను దత్తత తీసుకున్నట్లయితే, ఆ బిడ్డ న్యాయపర వారసుడే అవుతాడు.) మత్తయి ప్రకారం, దేవుడు యెషయా ద్వారా పలికిన మాటల నెరవేర్పు యేసు జన్మ వృత్తాంతమునకు అనుగుణంగానే ఉంది: " 'కన్యక గర్భవతియై కుమారుని కని అతనికి ఇమ్మానుయేలను పేరు పెట్టును' [ఇమ్మానుయేలు అంటే 'దేవుడు మనకు తోడు']" [యెషయా 7:14]. మరో మాటలో చెప్పాలంటే, దేవుడు తన కుమారుని ఈ లోకములోనికి దేవుని మరియు మానవుని గాను పంపించుటకు ఈమెను ఒక సాధనంగా చేసుకున్నాడు. "యేసు సగం – దేవుడు, సగం – మనిషి," లేదా అది దైవిక లక్షణాలున్న మానవుడు అని గాని క్రొత్త నిబంధన బోధించుట లేదు గాని, ఆయన వంద శాతం దేవుడు అని వంద శాతం మానవుడు అని క్రొత్త నిబంధన బోధిస్తుంది. మన జ్ఞానమునకు ఇది అందదు గాని, ఇది దేవుని స్వభావంలోని మర్మము.

వంశావళి యొక్క ఒక ప్రభావమేమంటే, చరిత్రలో ఒక కాలంలో జీవించిన నిజమైన వ్యక్తిగా ఇది యేసును చూపిస్తుంది. చరిత్ర గల వ్యక్తిగా, పూర్వికులు ఉన్న చారిత్రిక వ్యక్తిగా ఇది యేసును చూపిస్తుంది (చరిత్రలో యేసును లూకా చూపించిన విధము గురించి చూడు లూకా 3:1, 2). యేసును చారిత్రాత్మక వ్యక్తికంటే కూడా ఆయన్ను ఒక భావం అని లేక అనుభూతి అని నమ్మేవారు ఆయన ఒక చారిత్రాత్మక వ్యక్తి అనే సత్యాన్ని విస్మరిస్తుంటారు, "అనగనగా ఒకానొకప్పుడు యేసు అని ఒకాయన ఉండేవాడు" అన్న మాటలతో క్రొత్త నిబంధన ప్రారంభం కాలేదు. కల్పిత కథలు, పుక్కిటి పురాణాలు గురించి మనం మాట్లాడుకోవడం లేదు. దేవుని మానవ కుమారుని గురించి మనం మాట్లాడుకుంటున్నాము.

అదే సమయంలో యేసు పూర్తిగా దేవుడు. ఆయన రూపాంతర అనుభవం గురించి

సాక్ష్యమిచ్చే అవకాశం ముగ్గురు శిష్యులకు దక్కింది (మత్తయి 17:1–8). పేతురు, యోహాను, యాకోబులు యేసుతో కూడా కొండపైకి వెళ్ళారు. వారి కళ్ళ ఎదుటే, ఆయన రూపాంతరం చెందారు. తద్వారా ఆయన దైవిక మహిమను వారు చూడగలిగారు. మోషే ఏలియాలు ఆయనతో కూడ కనబడ్డారు. పేతురు వారి నిమిత్తం గుడారము కట్టుటకు ప్రయత్నించగా, ఒక మేఘం వారిని కమ్మివేసింది. అందులోంచి ఒక స్వరము ఇలాగు మాట్లాడింది, "ఇదిగో ఈయన నా ప్రియకుమారుడు, ఈయనయందు నేనానందించుచున్నాను, ఈయన మాట వినుడి" ఈ సంఘటన ముందువరకు వారు ఆయన్ను ఒక ప్రత్యేక మనిషిగానే చూశారు. ఈ సందర్భంలో వారు ఆయన్ను ఒక మనిషి కంటే ఎక్కువగానే చూశారు. శరీరాకారములోనున్న దేవుని కుమారుడాయన; పౌలు పేర్కొన్న విధంగా దేవుని స్వభావం కలిగియున్నవాడాయన (కొలొస్సయులకు 1:19; 2:9).

మత్తయి 1, 2 అధ్యాయాలలో చెప్పబడిన విధంగానే, దేవుని అద్భుతమైన ప్రణాళిక ఫలితంగా, దేవుని ఏకైక కుమారుడు, యేసు ఈ లోకంలోకి వచ్చాడు. ఆయన రాకకు ఎనిమిది వందల ఏళ్ళ మునుపే యెషయా ప్రవక్త ద్వారా ఆయన రాక ప్రవచించబడింది (యెషయా 7:14; 9:1–7). మత్తయి 1:21, 25 ప్రకారం, ఆయన పేరు కూడా దేవునిచేత నిర్ణయించబడింది. యేసుని బాల్య దశలో ఆయనకు ఇవ్వబడిన దైవిక సంరక్షణ మరియు ఆయన్ను గురించి ఆయనను పెంచిన తండ్రికి ఇయ్యబడిన సూచనలు 2వ అధ్యాయంలో కనబడుతున్నాయి. బాలుడైన యేసును గురించిన హేరోదు దురాలోచన గురించి ముగ్గురు జ్ఞానులు స్వప్నమందు (దైవిక స్వప్నం) హెచ్చరించబడిన వారై అతని యొద్దకు తిరిగి వెళ్ళ లేదు (2:12). అదేవిధంగా యోసేపు కూడా దాని నిమిత్తం హెచ్చరింపబడి దేవుని దూత సూచన ప్రకారం తన కుటుంబంతో సహా ఐగుప్తునకు వెళ్ళిపోయాడు (2:13–15). హేరోదు మరణం తరువాత, మరోసారి యోసేపు దూతచేత దర్శనంనొంది ఇశ్రాయేలునకు తిరిగి వెళ్ళుటకు చెప్పబడాడు. వారు యూదయ ప్రాంతమునకు వెళ్ళ లేదు. ఎందుకంటే, హేరోదు కుమారుడు అర్కెలాయు అక్కడ అధికారంలోనున్నాడు.

దేవుని కుమారుడు మానవునిగా మనవలెనే ఒక శిశువుగా ఈ లోకంలోకి వచ్చాడు. అటువంటి నిస్సహాయ పరిస్థితిలో కూడ తన తండ్రిచేత సురక్షితముగా సంరక్షించబడ్డాడు. సర్వ మానవాళి పాప పరిహారార్ధ బలికై తన ప్రాణమును పెట్టువరకు కూడా దైవ మానవుడైన యేసు తండ్రి కాపుదలలోనే ఆయన ఉన్నాడు.

ఇశ్రాయేలు యొక్క అద్భుత చరిత్ర యొక్క నెరవేర్పు యేసేనన్న విషయాన్ని మత్తయి తన ప్రారంభ వచనాల ద్వారా స్పష్టం చేస్తున్నాడు.

## ముగింపు

మనకు కేవలం ఒక చరిత్ర పాఠాన్ని ఇవ్వడం సువార్త గ్రంథకర్త యొక్క ఉద్దేశం కాదు. మన మెస్సీయను గురించి, మన రక్షకుని గురించి, శరీరధారియైన మన దేవుని మనకు ఇతడు చెప్పదల్చాడు. ఈ సందేశాన్ని మనమెవ్వరము విస్మరించకూడదు. ఎందుకంటే, మనమందరము పాపుల సంఖ్యలోయున్నవారము. మనకు విమోచన, క్షమాపణ, సంపూర్ణత ఇవ్వగలిగేది యేసు ఒక్కడే.

మత్తయి శుభవార్త (క్రొత్త నిబంధన అంతయు) యేసు అను ఒక మనుష్యుని కథకంటే

మరింత గొప్ప సత్యాన్ని మనకు చెప్తుంది. నమ్మి, విధేయులమై విమోచన పొందాలని ఇది పిలుపునిస్తుంది. మనమందరము వినవలసిన శుభవార్త ఇది.

---

సూచన

[1]Thomas G. Long, *Matthew,* Westminster Bible Companion (Louisville: Westminster John Knox Press, 1997), 8.

---

## మత్తయి మరియు లూకా సువార్తలలో యేసు జన్మ వృత్తాంతం

యేసు జన్మ వృత్తాంతం గురించి కేవలం రెండు గ్రంథములలోనే వ్రాయబడింది (మత్తయి 1; 2; లూకా 1; 2), గనుక ఆ రెండింటిలోని పోలికలు మరియు వ్యత్యాసములను పరిశీలించడం కోసం ఈ రెండింటిని పరిశీలించవలసిన అవసరత ఉంది.

యేసు జననమును వివరిస్తూ, యోసేపు, అతనిపట్ల దేవుని కార్యములు, మరియు అతని గురించి అతని భావముల మీద మత్తయి ఎక్కువ దృష్టియుంచాడు. అయితే లూకా మాత్రం మరియమ్మ వైపునుండి ఎక్కువగా వ్రాస్తున్నాడు. దూత మరియకు కనబడడం, తన పట్ల దేవుని ప్రేమను ఆమె గుర్తించడం, ఆమె ఎలీసబెతును దర్శించడం వంటి వాటిని లూకా వివరించాడు.

అప్పుడే పుట్టిన రాజును దర్శించి ఆరాధించినవారు "జ్ఞానులు" అని, వారి కానుకలను బట్టి వారు ధనవంతులు అని అర్థమవుతుంది. వీరు మొదటిగా మెస్సీయను దర్శించారని మత్తయి వ్రాస్తుండగా, రాజుని గురించిన వార్త మొదటిగా ప్రకటింపబడింది. అల్పులైన గొఱ్ఱెల కాపరులకు అని లూకా వ్రాస్తున్నాడు.

యేసు యొక్క వంశావళిలో మత్తయి తన సువార్తను ఆరంభించినట్లుగానే, లూకా కూడా ఒక వంశావళినిచ్చాడు (లూకా 3:23-38). కానీ ఇది అబ్రాహామునుండి గాకుండా, యేసునుండి అబ్రాహాముకు క్రింది నుండి పైకి వెళ్ళుతుంది. అబ్రాహాముతో ఇది ఆగిపోకుండా, ఆదాము వరకు అక్కడినుండి దేవుని వరకు వెళ్ళింది. యేసును కేవలం ఇశ్రాయేలునకు మాత్రమే గాక, మానవాళి అంతటితోనూ సంబంధించిన వానిగా చూపుట ఈ వంశావళి యొక్క ఉద్దేశం. ఎందుకంటే, యేసును సార్వత్రిక రక్షకునిగా చూపించడం లూకా యొక్క ప్రధాన ఉద్దేశములలో ఒకటి. ఈ రెండు వంశావళులలో తరములు ఒక్కటే అయినా గాని, అవి రెండూ ఒకటి కావు. అంటే ఇవి రెండూ తప్పు అని అర్థం కాదుగాని, ఇద్దరు గ్రంథ కర్తలు తమ తమ ఉద్దేశములను చెప్పదల్చుకున్నారు అంతే!

మత్తయి కంటే లూకాలో రెండు గాథలు చేర్చబడ్డాయి. అవి, బాప్తిస్మమిచ్చు యోహాను జన్మ గురించి మరియు యేసు చిన్నతనంలో ఆయన పన్నెండేళ్ళప్పుడు దేవాలయమును సందర్శించుటను గురించినది (లూకా 2:41-52).

---

## లేఖనముల నెరవేర్పు

"నెరవేర్చబడిన" లేఖనముల గురించి చదువుతున్నప్పుడు, మనం సాధారణంగా ఒక సంఘటన గురించి చెప్పబడి, అది నెరవేర్చబడడం లేదా నిజమవడం అని మనం భావిస్తాము – ఉదాహరణకు మెస్సీయ జన్మ స్థలం గురించిన మీకా 5:2 వచనం (మత్తయి 2:3-6).

ఒక్కోసారి “నెరవేర్చబడిన” లేఖనములను అర్థంచేసుకోవడం కష్టతరంగా ఉంటుంది.

“నెరవేర్పు” యొక్క అర్థమును సులభంగా గ్రహించాలంటే, లేఖనము యొక్క ఉద్దేశిత అర్థము “సంపూర్ణముగా తీర్చబడడం” లేదా “సరిపోవడం.” ఉదాహరణకు, కన్య మరియ యేసునకు జన్మనివ్వడం అనేది యెషయా 7:14 యొక్క నెరవేర్పు అని మత్తయి వ్రాశాడు. అంటే, రాజైన ఆహాజునకు సూచనగా యెషయా చెప్పిన ప్రవచనం నిజానికి దేవుని ప్రణాళికలో భాగం. నిజానికి దీని నెరవేర్పు, కన్య “మరియ” యేసునకు జన్మనివ్వడంలో జరిగింది.

ఒక్కోసారి “నెరవేర్చబడిన” పాత నిబంధన వాక్య భాగం, క్రొత్త నిబంధన గ్రంథకర్తలచేత పేర్కొనబడిన సందర్భమునకు సరిపోనిదిగా కనిపించవచ్చు. దీనికి ఉదాహరణగా, మత్తయి 2:13–15లోని యోసేపు ఐగుప్తు ప్రయాణమును చెప్పవచ్చు. హేరోదు ఖడ్గమును తప్పించుకొనుటకు, యోసేపు తన కుటుంబంతో ఐగుప్తునకు వెళ్ళి తరువాత కాలంలో తిరిగి పాలస్తీనాకు తిరిగి వచ్చాడు. “ఐగుప్తులోనుండి నా కుమారుని పిలిచితిని” అని ప్రవక్త ద్వారా ప్రభువు సెలవిచ్చిన మాట నెరవేర్చబడునట్లు హేరోదు మరణము వరకు అక్కడుండెను అని మత్తయి వ్రాస్తున్నాడు. పేర్కొనబడిన వాక్య భాగం హోషేయ 11:1లోనిది. దీని నేపథ్యాన్ని చూస్తే, దేవుడు తన ప్రజలను ఐగుప్తు బానిసత్వమునుండి విడిపించినప్పుడు, దానిని గుర్తు చేస్తూ చెప్పబడినది. కానీ మత్తయి ప్రకారం, ఈ సంఘటన దేవుడు తన కుమారుడైన యేసును ఐగుప్తునుండి పిలుచుటకు సంబంధించినది.

క్రొత్త నిబంధనలో, ఇటువంటి “నెరవేర్చబడిన” లేఖనములను మనం చూసినప్పుడు, దేవుడు తన వాక్యాన్ని మనం ప్రతి కోణంలోనూ గ్రహించాలని, యేసు ఎవరు, ఆయన ఏం చేశాడు అన్న విషయాన్ని అనేక విధాలుగా తెలియజేస్తున్నాడని మనం చూస్తున్నాం.